# నినాదం

నిఖార్సైన జర్నలిజం

కరీంనగర్ - నిజామాబాద్ - ఆదిలాబాద్ - పెద్దపల్లి | గురువారం, 13 ఆగస్టు 2026




## ప్రపంచ వేదికపై తెలంగాణ కీర్తి..

### రిశ్వితకు ఘన సన్మానం

భిక్కనూరు, ఆగస్టు 12 (నినాదం): ప్రపంచ సెయిలింగ్ ఛాంపియన్‌షిప్‌లో రజత పతకం సాధించి దేశానికి, తెలంగాణకు గర్వకారణంగా నిలిచిన బిక్కనూర్ నివాసి రిశ్విత సుంచనకోటను రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఘనంగా సన్మానం చేశారు. తన కార్యాలయంలో రిశ్వితను అభినందించి, ఆమె ప్రతిభను ప్రశంసించారు. అంతర్జాతీయ స్థాయిలో రిశ్విత సాధించిన విజయం తెలంగాణ యువతకు స్ఫూర్తిదాయకమని మంత్రి పేర్కొన్నారు. కష్టపడి సాధన చేస్తే గ్రామీణ ప్రాంతాల నుంచి కూడా ప్రపంచ స్థాయిలో రాణించవచ్చని రిశ్విత విజయం నిరూపించిందని తెలిపారు. భవిష్యత్తులో ఆమె మరిన్ని విజయాలు సాధించి దేశానికి మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు.



## సిద్ధరామేశ్వర స్వామికి భక్తుల కానుకలు..

### 5 నెలల హుండీ ఆదాయం రూ.5.41 లక్షలు

భిక్కనూరు, ఆగస్టు 12(నినాదం): కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండలంలోని శ్రీ సిద్ధరామేశ్వర స్వామి ఆలయంలో బుధవారం హుండీ లెక్కింపు నిర్వహించారు. గత ఐదు నెలలుగా భక్తులు సమర్పించిన కానుకలను లెక్కించగా రూ.5,41,830 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి వి. శ్రీధర్‌రావు తెలిపారు.హుండీలో బంగారం, వెండి వస్తువులతో పాటు విదేశీ కరెన్సీ నోట్లు ఏవీ లభించలేదని తెలిపారు. హుండీ లెక్కింపు కార్యక్రమంలో దేవాదాయ శాఖ పరిశీలకులు సత్యనారాయణ, ఆలయ ఆనువంశిక అర్చకులు కొడకండ్ల రామగిరి శర్మ, ఆలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ టి. లింబాద్రి, కమిటీ సభ్యులు, కామారెడ్డి సేవా సమితి సభ్యులు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నేర నియంత్రణకు పటిష్ఠ చర్యలు..

### పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి ఎస్పీ అశోక్‌కుమార్

మెట్ పల్లి ఆగస్ట్ 12: (నినాదం):జిల్లాలో నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ఐపీఎస్ పోలీసు అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన నెలవారీ క్రైమ్ సమావేశంలో డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో జిల్లాలోని నేరాల పరిస్థితి, కేసుల దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసులు, చార్జిషీట్ల దాఖలు, నేర నియంత్రణ, ట్రాఫిక్, సైబర్ నేరాలు, మహిళలు, చిన్నారుల భద్రత తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో సమస్యలను ముందుగానే గుర్తించి నేరాల నివారణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఇప్పటికే నమోదైన కేసులను త్వరితగతిన ఛేదించి బాధితులకు న్యాయం అందేలా పనిచేయాలన్నారు. పెండింగ్ కేసులను ప్రాధాన్యతతో పరిష్కరించి కోర్టుల్లో శిక్షల శాతం పెరిగేలా నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి కేసులో పక్కా సాక్ష్యాధారాలను సేకరించి సకాలంలో చార్జిషీట్లు దాఖలు చేయాలన్నారు.



### విజబుల్ పోలీసింగ్ పెంచాలి

ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో విజబుల్ పోలీసింగ్‌ను పెంచాలని ఎస్పీ సూచించారు. ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ పోలీసులపై నమ్మకం పెంచేలా వ్యవహరించాలన్నారు. మహిళల భద్రత, పోక్సో, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలని, గ్రేవ్, నాన్‌గ్రేవ్ కేసుల్లోనూ నాణ్యమైన దర్యాప్తు చేపట్టాలని ఆదేశించారు.

02

### సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన

నేర నియంత్రణలో భాగంగా సొసైటీ ఫర్ పబ్లిక్ సేఫ్టీ కార్యక్రమం కింద పట్టణాల్లోని కాలనీలు, గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకునేలా ప్రజలు, వ్యాపారులకు అవగాహన కల్పించాలని సూచించారు. చోరీల నివారణకు ప్రతి సర్కిల్ పరిధిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి పటిష్ఠ చర్యలు చేపట్టాలన్నారు. భూవివాదాలు, పాత కక్షల నేపథ్యంలో నేరాలకు పాల్పడే వారిని గుర్తించి బైండోవర్ చేయాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై అవసరమైతే కొత్తగా రౌడీషీట్లు తెరవాలని ఆదేశించారు.

### - డ్రగ్స్‌పై ప్రత్యేక నిఘా

గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలపై ప్రత్యేక నిఘా ఉంచాలని ఎస్పీ ఆదేశించారు. విద్యాసంస్థలు, యువత ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి మత్తు పదార్థాల బారిన పడకుండా చర్యలు చేపట్టాలన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించేందుకు సైబర్ టీములు చురుకుగా పనిచేయాలని సూచించారు.

## క్రీడలతో స్నేహభావం పెంపొందుతుంది

### సీనియర్ సివిల్ జడ్జి డి. నాగేశ్వర్‌రావు



మెట్ పల్లి ఆగస్ట్ 12 (నినాదం):క్రీడలు ఆడటం వల్ల స్నేహభావం పెంపొందడంతోపాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని మెట్‌పల్లి ఇన్‌చార్జి సీనియర్ సివిల్ జడ్జి డి. నాగేశ్వర్‌రావు అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా పోటీలను బుధవారం జూనియర్ సివిల్ జడ్జి వినుకొండ మాధవితో కలిసి ఆయన ప్రారంభిం చారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. క్రీడలు శారీరక దృఢత్వంతోపాటు మానసిక ప్రశాంతతకు దోహదపడతాయన్నారు. పోటీల సమయంలోనే కాకుండా రోజువారీ జీవితంలోనూ క్రీడలను భాగం చేసుకోవాలని సూచించారు. క్రీడలు పరస్పర స్నేహం, సహకారాన్ని పెంపొందిస్తాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలేటి రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి నల్ల రాజేందర్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెర్లపల్లి ఆనంద్‌గౌడ్, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసి క్యూటర్ జి.ప్రణయ్, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ అబ్దుల్ హఫీజ్, క్రీడా కార్యదర్శి నీరటి రమణ, న్యాయవాదులు వడ్డేపల్లి శ్రీనివాసన్, కంతి మోహన్‌రెడ్డి, పుప్పాల రాంభూపాల్, పోలకొండ దయాకర్‌వర్మ, గడ్డం శంకర్‌రెడ్డి, బోడ లక్ష్మణ్, ఒజ్జెల శ్రీనివాస్, అలుముల రాంబాబు, తెడ్డు ఆనంద్, ద్యావని సత్యనారాయణ, చింతకుంట శంకర్ తదితరులు పాల్గొన్నారు.



02

## ఉచిత పోలీస్ శిక్షణకు ప్రవేశ పరీక్ష

భిక్కనూరు, ఆగస్టు 12 (నినాదం): పోలీస్ ఉద్యోగం సాధించాలనే లక్ష్యం ఉన్న గ్రామీణ ప్రాంత యువతకు అఖిల్ రాజ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత పోలీస్ శిక్షణ అందించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఫౌండేషన్ చైర్మన్ తౌడా సత్యనారాయణ ఆధ్వర్యంలో, ప్రతినిధి మిద్దె శాంతికుమార్ పర్యవేక్షణలో ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నారు.

# కాలువ స్థలంపై కబ్జా కసరత్తు?

## మున్సిపల్ వాహనాలతో ప్రభుత్వ భూమి చదును.. ప్రజాప్రతినిధి రహస్య సర్వే!

**పెద్దపల్లి రూరల్, ఆగస్టు 12 (నినాదం):** పెద్దపల్లి జిల్లా కేంద్రంలో ప్రభుత్వ భూములు, ఎస్సారెస్పీ కాలువ భూములు, దేవాలయ ఆస్తుల పరిరక్షణపై మరోసారి ప్రశ్నలు తలెత్తుతున్నాయి. బస్టాండ్ సమీపంలోని సర్వే నంబర్ 331లోని పట్టా భూమి ఎస్సారెస్పీ కాలువకు ఆనుకుని ఉండటంతో, ఆ ప్రాంతంలో జరుగుతున్న భూచదును పనులు స్థానికంగా తీవ్ర చర్చకు దారితీశాయి.

**మున్సిపల్ వాహనాలతో మట్టి తరలింపు**

స్థానికుల కథనం ప్రకారం.. సోమవారం ఆ ప్రాంతంలో మున్సిపల్ ట్రాక్టర్లను వినియోగించి మట్టిని తరలించి ఖాళీ స్థలాన్ని చదును చేసి లెవలింగ్ చేశారు. దీంతో కాలువకు ఆనుకుని ఉన్న స్థలంపై కబ్జాకు రంగం సిద్ధమవుతోందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**ద్విచక్ర వాహనంపై స్థలాల పరిశీలన?**

ఇదే సమయంలో ఓ కీలక ప్రజాప్రతినిధి ద్విచక్ర వాహనంపై పరిసర ప్రాంతాల్లోని ఖాళీ స్థలాలను పరిశీలిస్తూ కనిపించడం స్థానికుల్లో మరిన్ని అనుమానాలకు తావిచ్చింది. ఈ పరిణామాలను కొందరు చిత్రీకరించే ప్రయత్నం చేయగా, సదరు ప్రజాప్రతినిధి అక్కడి నుంచి వెళ్లిపోయినట్లు స్థానికులు చెబుతున్నారు.

**పట్టా భూమి.. కాలువకు ఆనుకుని ఉండటంతోనే వివాదం**

సయ్యద్ మోహినుద్దీన్ అఫ్జల్ పేరుతో సర్వే నంబర్ 331లో భూమి ఉన్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. సుమారు మూడు దశాబ్దాల క్రితం ఆయన అవసరాల నిమిత్తం కొంత భూమిని ఇతరులకు విక్రయించి



ప్రస్తుతం విదేశాల్లో ఉంటున్నట్లు సమాచారం. అయితే భూమి ఎస్సారెస్పీ కాలువకు ఆనుకుని ఉండటంతో ఈ ప్రాంతంలో జరుగుతున్న పనులపై అనేక సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

**అధికారులకు సమాచారం ఉందా?**

భూమి యజమానులకు, సంబంధిత ఎస్సారెస్పీ అధికారులకు, ఇతర శాఖల అధికారులకు సమాచారం ఇవ్వకుండా మున్సిపల్ యంత్రాంగం ద్వారా స్థలాన్ని చదును చేయడం వెనుక అసలు ఉద్దేశం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. అధికార పార్టీకి చెందిన ప్రజాప్రతినిధుల ప్రమేయం ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో అధికారులు దీనిపై స్పష్టత ఇవ్వాలని వారు కోరుతున్నారు.

**నివాసితుల్లో ఆందోళన**

కాలువకు సమీపంలో ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్న స్థానికులు ఈ పరిణామాలతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భవిష్యత్తులో కాలువ భద్రతకు, డ్రైనేజీ వ్యవస్థకు, తమ నివాసాలకు ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని వారు చెబుతున్నారు.

**అధికారుల విచారణకు డిమాండ్**

ప్రభుత్వ, ఎస్సారెస్పీ, దేవాలయ భూముల విషయంలో ఓఎలాంటి అక్రమాలకు తావులేకుండా అధికారులు సమగ్ర సర్వే నిర్వహించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. సర్వే నంబర్ 331తో పాటు కాలువ పరిధిలోని భూముల హద్దులను అధికారులు పరిశీలించి, మున్సిపల్ వాహనాలతో జరిగిన చదును పనులపై విచారణ చేపట్టాలని కోరుతున్నారు.
కాలువ భూముల పరిరక్షణలో అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారు?
చదును చేసిన స్థలం ఎవరిది? మున్సిపల్ వాహనాలను అక్కడికి ఎవరి ఆదేశాలతో తరలించారు?
అనే ప్రశ్నలకు అధికారుల సమాధానాల కోసం స్థానికులు ఎదురుచూస్తున్నారు.

## ఉచిత పోలీస్ శిక్షణకు ప్రవేశ పరీక్ష

**మొదటి పేజి తరువాయి**

ఈ సందర్భంగా భిక్కనూరు ఎస్ఐ అనిల్ కుమార్ ఉచిత పోలీస్ శిక్షణ పోస్టర్‌ను ఆవిష్కరించారు. శిక్షణకు అభ్యర్థుల ఎంపిక కోసం ఆగస్టు 16న ఆదివారం ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులకు ఉచిత పోలీస్ శిక్షణ అందించనున్నారు. పరీక్ష రామాయంపేటలోని స్నేహా జూనియర్ కాలేజీలో నిర్వహించనున్నారు. ఆసక్తి ఉన్న యువత QR కోడ్ ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని నిర్వాహకులు కోరారు. మరిన్ని వివరాలకు 9849051483 నంబర్‌ను సంప్రదించాలని తెలిపారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## నేర నియంత్రణకు పటిష్ఠ చర్యలు...

**మొదటి పేజి తరువాయి**

**ఉత్తమ ప్రతిభకు ప్రశంసా పత్రాలు**

విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులు, పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించి ప్రశంసా పత్రాలను అందజేశారు. సమావేశంలో అదనపు ఎస్పీ చేతన్ నితిన్ ఐపీఎస్, డీఎస్పీలు పురుషోత్తం రెడ్డి, రాములు, రవికుమార్, ఇన్‌స్పెక్టర్లు ఆరిఫ్ అలీఖాన్, శ్రీనివాస్, కరుణాకర్, రాజ్‌కుమార్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు వేణు, సైదులు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## 14 సంవత్సరాల బాలికలకు హెచ్‌పీవీ టీకాలు



**భిక్కనూరు,ఆగస్టు12 (నినాదం):** భిక్కనూరు బాలుర ఉన్నత పాఠశాలలోని 14 ఏళ్ల బాలికలకు హెచ్‌పీవీ టీకాలు వేశారు. ఈ సందర్భంగా హెచ్ పీవీ టీకా ప్రాధాన్యతపై బాలికలకు అవగాహన కల్పించారు. బాలి కల ఆరోగ్య పరిరక్షణలో భాగంగా టీకా కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఏ ఎన్ ఎం లు లలిత, శ్యామల, ఆశా కార్యకర్తల ఆధ్వర్యంలో టీకా కార్యక్రమం నిర్వహించారు.

## కమాన్‌పూర్ వీధుల్లో ఫాగింగ్..

## దోమల నివారణకు చర్యలు



**కమాన్‌పూర్, ఆగస్టు 12 (నినాదం):** కమాన్‌పూర్ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో దోమల నివారణ చర్యలకు శ్రీకారం చుట్టారు. ఇందులో భాగంగా బుధవారం రాత్రి గ్రామంలో ఫాగింగ్ యంత్రాన్ని సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్, ఉపసర్పంచ్ మహమ్మద్ రఫీక్ సోహెల్ మాట్లాడుతూ, గ్రామంలో దోమల వ్యాప్తిని నియంత్రించేందుకు ఫాగింగ్ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామంలోని వివిధ ప్రాంతాల్లో క్రమం తప్పకుండా ఫాగింగ్ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు నీరు నిల్వ ఉండకుండా ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు గుంజపడుగు నవీన్, పంజా సాయిరాం, పచ్చునూరి రాజ్‌కుమార్, మెరుగు కుమార్, తూటీ రాజు, గ్రామపంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మహనీయుల విగ్రహాలు.. చైతన్య కేంద్రాలు!

**ముస్త్యాలలో విగ్రహాల ఏర్పాటుకు స్థల పరిశీలన**

**మాజీ సర్పంచ్ రామగిరి లావణ్య--నాగరాజు ఆధ్వర్యంలో..**





**ముస్త్యాల, ఆగస్టు నినాదం12:** రామగిరి మండలం ముస్త్యాల గ్రామంలో డా. బీఆర్ అంబేద్కర్, కొమురం భీమ్, జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే, బిర్సా ముండా, భగత్‌సింగ్, చాకలి ఐలమ్మ, ఝాన్సీ లక్ష్మీబాయి, జగ్జీవన్‌రామ్, ఛత్రపతి షాహూ మహారాజ్ తదితర మహనీయుల విగ్రహాల ఏర్పాటుకుమాజీ సర్పంచ్ రామగిరి లావణ్య--నాగరాజు దంపతుల ఆధ్వర్యంలో బుధవారం స్థల పరిశీలన నిర్వహించారు. మాజీ సర్పంచ్ రామగిరి లావణ్య--నాగరాజు దంపతుల ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మామిడిపల్లి బాపయ్య మాట్లాడుతూ దళిత, బహుజనుల హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. తెలంగాణ రైతు సమస్యల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ముడిమడుగుల మల్లన్న మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా మహనీయుల విగ్రహాలను ఏర్పాటు చేయాలన్నారు. సమతా సైనిక దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డా. మార్షల్ దుర్గం నగేష్ మాట్లాడుతూ మహనీయుల విగ్రహాలు అలంకరణ కోసం కాదని, సమాజ ఆత్మగౌరవం, చరిత్రకు ప్రతీకలైన చైతన్య కేంద్రాలని అన్నారు. యువత మహనీయుల ఆశయాలను ఆచరణలో పెట్టాలని సూచించారు. విగ్రహాల ఏర్పాటుకు ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులు సహకరించాలని ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మైసా రాజయ్య కోరారు. కార్యక్రమంలో బొంకూరి మధు, బూడిద సమ్మయ్య, సురేష్, వెంకటేష్ తదితరులు, ప్రజా సంఘాల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఐక్యమత్యానికి ప్రతీక వందేమాతరం..!!



**కమాన్ పూర్ ఆగస్టు 12 (నినాదం):** ఐకమత్యానికి ప్రతీక వందేమాతర గీతం అని బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు మచ్చగిరి రాము అన్నారు. బుధవారం కమాన్ పూర్ మండల కేంద్రంలో ని అంగడి బజార్ వద్ద ప్రముఖ డ్యాన్సర్ డ కొరియోగ్రాఫర్ పులిపాక దేవా ఆధ్వర్యంలో రూపొందించిన వందేమాతరం పాటను తహసిలార్ ముస్త్యాల వాసంతి ఎంపీడీవో సాధినేని ప్రియాంక ఆర్ ఐ ప్రవంతి గుండారం సర్పంచ్ జంగిలి పోచాలు, పాటను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ.. మాతృత్వానికి ప్రతీక వందేమాతర గీతం అని కులమతాల కు అతీతంగా ఆలపించే గీతం వందేమాతరం అని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టు జబ్బార్ ఖాన్ మాట్లాడుతూ.. వందేమాతరం గీతంలో తాను నటించడం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని అన్నారు. అలాగే ఈ పాట మొత్తం గుండారం పరిసర ప్రాంతాల్లో తీయడం జరిగిందని దీనికిగాను కళాకారులు పూర్తిస్థాయిలో సహకరించాలని అన్నారు. అలాగే పాటలో దాసరి రామస్వామి, జబ్బార్ ఖాన్ వీర్ల ప్రశాంత్, మ్యాజిక్ శశి, తజావత్ పవన్ కళ్యాణ్, ఆసంపల్లి సౌమ్య, మడిపోజు మౌనిక, మరి పోజు మానస, గుగులోతు ఝాన్సీ, శివ, నటించడం జరిగిందని పేర్కొన్నారు. కెమెరామెన్ గా ఉప్పు నారాయణ వహించగా ఎడిటింగ్ మెహబూబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లవెల్లి శంకర్, బీజేపీ మండల శాఖ అధ్యక్షుడు కోయడ సతీష్,దాసరి పల్లె ఉపసర్పంచ్ సతీష్, కార్యదర్శి బచ్చల ప్రసాద్,దామెర దేవయ్య, సామ్రాట్ రాజేష్, లల్లు, నగునూరి నరసయ్య, మెడగొని శ్రీనివాస్, కళాకారులు దాసరి రామస్వామి, జబ్బార్ ఖాన్, మడిపోజు మానస, కాంపల్లి సౌమ్య ప్రజలు పాల్గొన్నారు.

## దోమల నియంత్రణకు విస్తృతంగా ఫాగింగ్..

**– వర్షాల నేపథ్యంలో ప్రత్యేక చర్యలు.. ప్రజలు సహకరించాలి: షాద్మా రైస్**



**మెట్ పల్లి ఆగస్ట్ 12 : ( నినాదం):** వర్షాల నేపథ్యంలో దోమల వ్యాప్తిని అరికట్టేందుకు మున్సి పల్ ఆధ్వర్యంలో నిరంతరం ఫాగింగ్ కార్యక్రమాలు చేపడు తున్నట్లు మున్సిపల్ కోఆప్షన్ సభ్యురాలు షాద్మా రైస్ తెలి పారు. పట్టణంలోని 23వ వార్డు లో బుధవారం నిర్వహించిన ఫాగింగ్ కార్యక్రమాన్ని ఆమె దగ్గరుండి పర్యవేక్షించారు. వార్డులోని ప్రధాన రహదారులు, వీధులు, నివాస ప్రాంతాల్లో ఫాగింగ్ చేయించారు. ఈ సందర్భంగా షాద్మా రైస్ మాట్లాడుతూ.. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉండటంతో దోమల ఉద్ధృతి పెరిగే అవకాశం ఉందన్నారు. దోమల ద్వారా సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మున్సిపల్ సిబ్బంది నిరంతరం ఫాగింగ్ నిర్వహిస్తూ దోమల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. ప్రతి ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతోపాటు నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. ఇంటి పరిసరాల్లో చెత్తాచెదారం పేరుకుపోకుండా చూసుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. దోమల నియంత్రణకు మున్సిపల్ అధికారులు, సిబ్బంది చేపడుతున్న చర్యలకు ప్రజలు కూడా సహకరించాలని ఆమె కోరారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో అవసరాన్ని బట్టి ఫాగింగ్ కార్యక్రమాలను కొనసాగిస్తామని పేర్కొన్నారు.

## పార్టీ బలోపేతమే లక్ష్యంగా..

## ఎమ్మెల్యేతో కాంగ్రెస్ నేతల భేటీ



**భిక్కనూరు, ఆగస్టు 12 (నినాదం):** కాంగ్రెస్ పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారం తదితర అంశాలపై ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ రావుతో భిక్కనూరు మండలానికి చెందిన కాంగ్రెస్ నాయకులు భేటీ అయ్యారు. బుధవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా మండలంలో పార్టీ కార్యక్రమాలు, స్థానిక సమస్యలు, పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలపై చర్చించారు. పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న నాయకులు, కార్యకర్తలకు తగిన ప్రాధాన్యత కల్పిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. పార్టీ బలోపేతానికి అందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ ఎస్సీ సెల్ కార్యదర్శి శంకర్, కౌసల్యా దేవి ఫౌండేషన్ చైర్మన్ జ్ఞాన ప్రకాష్ రెడ్డి, జిల్లా నాయకులు డప్పు రవి తదితరులు పాల్గొన్నారు.

గురువారం । తెలంగాణ
13 ఆగస్టు 2026

# నినాదం

తెలంగాణ ప్రాంతీయం — నిఖార్సైన జర్నలిజం

## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి



**బోధన్ ప్రతినిధి, ఆగస్టు 12: (నినాదం ):** ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ ఆధ్వర్యంలో బుధవారం భోజన విరామ సమయంలో సాలూరా మండల తహసిల్దార్ అజ్మత్ నవాజ్ కు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పిఆర్సి నివేదికను వెంటనే తెప్పించుకొని తేదీ 01-07 2023 నుండి అమలు చేయాలని, ఉద్యోగుల, ఉపాధ్యాయులకు పెండింగ్లో ఉన్న ఆరు విడతల డిఏను వెంటనే మంజూరు చేయాలని , రిటైర్డ్ ఉద్యోగులకు బకాయిలను వెంటనే విడుదల చేయాలని, సిపిఎస్ ను రద్దు చేసి ఒపిఎస్ ను పునరుద్ధరించాలని,ఎంప్లాయిస్ హెల్త్ కేర్ ట్రస్టును సమర్థవంతంగా అమలు చేయాలని, తదితర సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విఠల్ కాంబ్లే, అరుణ్ కుమార్, అబ్బయ్య విజయ్ కుమార్, రాజ్ కుమార్, సంగీతరావు, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల పనితీరు పై ఆరా తీసిన

## జిల్లా విద్యాధికారి రమేష్ కుమార్



**కల్వకుర్తి ఆగస్టు 12 (నినాదం)** వెల్దండ మండలంలోని కుత్ర ప్రాథమిక పాఠశాలను జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్‌కుమార్ మండల విద్యాధికారి కొండల్ రెడ్డితో కలిసి ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న బోధన, ప్రాథమిక తరగతుల నిర్వహణ, విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల పనితీరు తదితర అంశాలను ఆయన పరిశీలించారు. పాఠశాలకు చేరుకున్న డీఈఓ రమేష్‌కుమార్ తరగతి గదులను సందర్శించి విద్యార్థుల అభ్యసన స్థాయిని పరిశీలించారు. విద్యార్థులతో నేరుగా మాట్లాడి పాఠ్యాంశాలపై వారికి ఉన్న అవగాహనను తెలుసుకున్నారు. ప్రాథమిక స్థాయిలో విద్యార్థులకు బలమైన పునాది ఏర్పడేలా బోధన కొనసాగించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అదేవిధంగా పాఠశాలలో ప్రాథమిక తరగతుల నిర్వహణ తీరును, విద్యార్థుల హాజరు పరిస్థితిని, బోధనకు సంబంధించిన రికార్డులను డీఈఓ ఆరా తీశారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా అధికారులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని ఆయన తెలిపారు. విద్యార్థుల ప్రతిభను గుర్తించి, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి వారినీ అభ్యసనలో ముందుకు తీసుకురావాలని డిఈఓ రమేష్‌కుమార్ సూచించారు. పాఠశాలలో విద్యార్థులకు అనుకూలమైన విద్యా వాతావరణాన్ని కల్పిస్తూ, ప్రాథమిక విద్యను మరింత పటిష్టం చేసే దిశగా చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు.

## బోధన్ సబ్ డివిజన్ గాండ్ల కుల కమిటీ ఎన్నిక



**బోధన్ ప్రతినిధి,ఆగస్టు 12: (నినాదం) :** బోధన్ పట్టణంలో బోధన్ సబ్ డివిజన్ గాండ్ల కులస్తులు మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సబ్ డివిజన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా గాండ్ల నాగేశ్వర్ రావు,(బోధన్),అధ్యక్షులుగా నాగరాజు,ఉపాధ్యక్షులు గాండ్ల అంజయ్య,గాండ్ల సాయిలు,గాండ్ల లింగారాం, శివకుమార్,గాండ్ల రాజేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా గాండ్ల ప్రసాద్ ,ఉప కార్యదర్శులుగా మందర్న రమేష్,నవీన్,గాండ్ల లక్ష్మణ్,ఆంజనేయులు,గాండ్ల సురేష్,కోశాధికారిగా గాండ్ల సురేష్,ఐటీ సెల్ బాధ్యులుగా గాండ్ల ప్రవీణ్,గాండ్ల సందీప్ లను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ మాట్లాడుతూ గాండ్ల కులస్తులు రాజకీయంగా, ఆర్థికంగా, సామాజికంగా ఎదగడానికి కులస్తులతో కలిసి ప్రతి ఒక్కరూ ఏకతాటిపై ఉండి కృషి చేద్దామన్నారు. ఈ సమావేశంలో కుల పెద్దలు,కులస్తులు పాల్గొన్నారు.

## కల్దుర్కిలో ఘనంగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ



**బోధన్ ప్రతినిధి, ఆగస్టు 12: (నినాదం ):** ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పిలుపుమేరకు బోధన్ మండలం కల్దుర్కి గ్రామంలో బోధన్ మండల బిజెపి అధ్యక్షులు అధ్యక్షులు సిర్ప సుదర్శన్ ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీని ఘనంగా నిర్వహించారు. జాతీయ జెండాలను చేత పట్టుకొని,దేశభక్తి నినాదాలు చేస్తూ గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రతి ఇంటి పై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో ఉప సర్పంచ్ జ్యోతి శంకర్,వార్డ్ సభ్యులు అశోక్, హన్మాండ్లు, రమేష్, రాజు,జిల్లా కిసాన్ మోర్చా కార్యదర్శి మనోహర్, జిల్లా కార్యవర్గ సభ్యులు భాస్కర్ రెడ్డి,కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు న్యాలం శ్రీనివాస్,మండల ప్రధాన కార్యదర్శులు వెంకటేష్,లక్ష్మా రెడ్డి, బీజేపీ సీనియర్ నాయకులు,కార్యకర్తలు, యువకులు,తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సహకారంతో సిసి రోడ్డు పనులు

## ప్రారంభించిన మున్సిపాల్టీ చైర్ పర్సన్



**కల్వకుర్తి ఆగస్టు 12 (నినాదం):** కల్వకుర్తి మున్సిపాలిటీలోని 3వ, 22వ వార్డుల్లో పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ చైర్‌పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ కాలనీలలో పర్యటించారు. కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి సహకారంతో మంజూరైన అభివృద్ధి పనుల్లో భాగంగా 3వ వార్డులో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను, 22వ వార్డులో సీసీ రోడ్డు పనులను చైర్‌పర్సన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని కాలనీ ముఖ్య నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా కల్వకుర్తి మున్సిపాలిటీలో అభివృద్ధి పనులను చేపడుతున్నామని తెలిపారు. అన్ని వార్డుల సమగ్ర అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ, ప్రజల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులను మెరుగుపరుస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కేతావత్ రాము, ఎజాస్, మక్బుల్,పాపి శెట్టి శ్రీనివాస్, శివ ,మరియు తదితర నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# పీఎస్‌లో ఉరేసుకుని కానిస్టేబుల్ సాయి ఆత్మహత్య

ఆత్మహత్య చేసుకున్న కానిస్టేబుల్ సాయి కుటుంబాన్ని ఆదుకుంటాం..
కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇప్పించేందుకు కృషి చేస్తాం...
రూ.22లక్షల పరిహారం.. తక్షణ సాయం కింద రూ.10లక్షలు అందజేస్తాం...
ఇందిరమ్మ ఇల్లు తో పాటు తండ్రికి పెన్షన్ సౌకర్యం...
ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి హామీ...
ఎల్బీనగర్ పీఎస్ వద్ద కుటుంబసభ్యులకు, బంధువులకు ఎమ్మెల్యే భరోసా...
విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచన..



**ఎల్బీ నగర్, ఆగస్ట్ 12,(నినాదం):** విధి నిర్వాహణలో పోలీస్ స్టేషన్ లోనే ఓ కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్న ఘటన ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటుచేసుకుంది. ఈ సంఘటన స్థానికంగా కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే 2024 బ్యాచ్ కుచెందిన జర్పుల సాయికుమార్ ఎల్బీనగర్ ఏసీపీకార్యాలయంలో రాత్రి విధులకు హాజరయ్యాడు. కార్యాలయంలోనే ఆత్మహత్య చేసుకున్నాడు. తెల్లవారుజామున తోటి సిబ్బంది గమనించి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. ఎల్బీనగర్ సీఐ వినోద్ కుమార్ వెంటనేసాయికుమార్ ను సమీపంలోని కామినేని ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం,నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. ఇద్దరు కుమారుల్లో చిన్నవాడు సాయికుమార్ ఇబ్రహీంపట్నం నియోజకవర్గం మంచాల మండలం బండనేమూరు గ్రామపంచాయతీ పరిధిలోని ఆర్జనతండాకు చెందిన విజయ, బోడియాదంపతులకు ఐదుగురు సంతానం. ముగ్గురుకుమార్తెలకు వివాహాలు కాగా, ఇద్దరు కుమారులకుఇంకా వివాహాలు కాలేదు. ఇద్దరు కుమారుల్లో పెద్దకుమారుడు ఏఆర్ కానిస్టేబుల్గా పనిచేస్తుండగా,చిన్న కుమారుడు సాయికుమార్ ఎల్బీనగర్ ఏసీపీకార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నాడు. సాయికుమార్ మృతితో కుటుంబ సభ్యులు, గిరిజనసంఘాల నాయకులు పోలీస్ స్టేషన్కు చేరుకునిఆందోళన చేపట్టారు. సాయికుమార్ కుటుంబానికిన్యాయం చేయాలని వారు డిమాండ్ చేసారు. సంఘటనా స్థలానికి ఎల్బీనగర్ డీసీపీ అనురాధ,ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి, రాష్ట్రరోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్రెడ్డిరామిరెడ్డి చేరుకున్నారు.

**ఆత్మహత్య చేసుకున్న కానిస్టేబుల్ సాయి కుటుంబాన్ని ఆదుకుంటాం: ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి హామీ**



సాయి ఆత్మహత్య ఘటనపై ఇబ్రహీంపట్నం శాసన సభ్యులు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళనకు దిగిన కుటుంబసభ్యులు, బంధువు లతో మాట్లాడిన ఆయన... దుర్ఘటనపై పోలీస్ ఉన్నతాధికారులతో మాట్లాడారు. విధి నిర్వహణలో సాయిని ఇబ్బందికి గురిచేశారన్న ఆరోపణలపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీస్ ఉన్నతాధికారులకు మల్ రెడ్డి రంగారెడ్డి సూచించారు. ఈ మేరకు మల్కాజ్ గిరి సీపీ, డీసీపీతో మాట్లాడారు. సాయి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామన్న ఎమ్మెల్యే... ప్రత్యేక చొరవతో కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇప్పించేలా కృషి చేస్తామని తెలిపారు. అలాగే, రూ. 22 లక్షలను ప్రభుత్వం నుంచి అందజేయనున్నట్లు ప్రకటించిన ఆయన... తక్షణ సాయం కింద రూ. 10లక్షలు ఇస్తున్నట్లు చెప్పారు. తన నియోజకవర్గానికి చెందిన సాయి కుటుం బానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరుతో పాటు తండ్రికి పెన్షన్ వచ్చేలా చూస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఉద్యోగులకు ఉన్న కోటి రూపాయల బీమా సాధ్యపడే అవకాశం లేకపోవచ్చన్న మల్ రెడ్డి... దీనిపై సీఎంతో ప్రత్యేకంగా మాట్లాడతానన్నారు. మల్ రెడ్డి రంగారెడ్డి ఉన్నతాధికారుల హామీ మేరకు కుటుంబసభ్యులు ఆందోళన విరమించారు.

## దేశ ఐక్యత కోసం కాంగ్రెస్ సద్భావన యాత్ర.

### డిసీసీ అధ్యక్షులు కే. ప్రశాంత్ రెడ్డి



**నారాయణపేట ప్రతినిధి, ఆగస్టు 12, (నినాదం):** మత సామరస్యం,సామాజిక ఐక్యతే రాజీవ్ గాంధీ సద్భావన జ్యోతి యాత్ర లక్ష్యమని నారాయణపేట డిసీసీ అధ్యక్షులు కె. ప్రశాంత్ కుమార్ రెడ్డి అన్నారు. దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన రాజీవ్ గాంధీ సద్భావన జ్యోతి బస్సు యాత్ర కర్ణాటక రాష్ట్రం రాయచూర్ నుంచి కృష్ణా బ్రిడ్జి మీదుగా తెలంగాణలోకి ప్రవేశించిన సందర్భంగా బుధవారం నాడు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కే. ప్రశాంత్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. అనంతరం మాగనూరు,మక్తల్, ఉట్కూర్ మీదుగా నారాయణపేట జిల్లా కేంద్రంనికి చేరుకుంది. అంబెడ్కర్ చిట్టెం.నర్సిరెడ్డి విగ్రహాలకు పూల మాలలతో నివాళులు అర్పించిన అనంతరం అక్కడి నుంచి జులాపూర్ బార్డర్ వరకు యాత్ర కొనసాగింది. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షులు కే. ప్రశాంత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ రాజీవ్ గాంధీ దేశంలో మత సామరస్యం, జాతీయ సమైక్యత, సామాజిక న్యాయం, సౌభ్రాతృత్వం కోసం కృషి చేసిన మహా నాయకుడన్నారు. వారి ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే ఈ సద్భావన జ్యోతి బస్సు యాత్ర ప్రధాన లక్ష్యంమని,మతం, కులం,ప్రాంతం పేరుతో ప్రజల మధ్య విభేదాలు సృష్టించే ప్రయత్నాలను తిప్పికొట్టి,ప్రతి ఒక్కరూ సోదరభావంతో కలిసి జీవించాలనే సందేశాన్ని ఈ యాత్ర ద్వారా ప్రజలకు తెలియచేస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల హక్కులు,రాజ్యాంగ విలువలు, లౌకికవాదం, సామాజిక సమానత్వం కోసం నిలబడు తుందన్నారు. నేటి యువత రాజీవ్ గాంధీ ఆధునిక భారతదేశ స్వప్నాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజీవ్ సద్భావన జ్యోతి యాత్ర కన్వీనర్ దోరై వేలు స్వామి,యాత్ర ప్రధాన కార్యదర్శి సుజేంద్ర శెట్టి,మార్కెట్ చైర్మన్ శివారెడ్డి,కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి. సలీం, మండల,పట్టణ అధ్యక్షులు కోట్ల. రవీందర్ రెడ్డి, కౌన్సిలర్ రవితేజ, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కోట్ల మధుసూదన్ రెడ్డి, సీనియర్ నాయకులు ఎండి గౌస్, మనోహర్ గౌడ్, యండి. ఖాజా,బాల్ రెడ్డి,మహిమూద్ ఖురేషి, తదితరులు పాల్గొన్నారు.

## ఎర్ర సత్యం వర్ధంతి

### చిత్ర పటానికి నివాళులర్పించిన మున్సిపాల్టీ చైర్ పర్సన్



**కల్వకుర్తి ఆగస్టు 12 (నినాదం):** కల్వకుర్తి మండల కేంద్రంలోని ఎమ్మార్వో ఆఫీస్ అమరవీరుల స్తూపం దగ్గర ఎర్ర సత్యం వర్ధంతి సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన కల్వకుర్తి మున్సిపల్ చైర్మన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ ఈ సందర్భంగా మాట్లాడుతూ. పాలమూరు నేలపై అణిచివేతకు వ్యతిరేకంగా పోరాట గళం విప్పిన వీరుడు పేదల హక్కుల కోసం బడుగు బలహీన వర్గాల శ్రమజీవుల కోసం బడుగు బలహీన వర్గాల రాజ్యాధికారం కోసం పండుగ సాయన్న వారసునిగా పాలమూరు అగ్రవర్ణాల అహంకారాన్ని అణచివేసిన సామాజిక విప్లవ వీరుడు ఎర్ర సత్యం అన్న వర్ధంతి కల్వకుర్తి లో బీసీ జేఏసీ సంఘం మరియు కల్వకుర్తి ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో ఎర్ర సత్యం వర్ధంతిని ఘనంగా జరుపుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బృంగి రత్నమాల ఆనంద్ కుమార్,బీసీ సబ్ ప్లాన్ కల్వకుర్తి తాలూకా అధ్యక్షులు మ్యాకాల రాజేందర్,డి ఎఫ్ సి ఎస్ జిల్లా డైరెక్టర్ మరియు బిసి సంక్షేమ సంఘం తాలూకా అధ్యక్షులు గొడుగు భానుచందర్, పెద్దయ్య యాదవ్,ముదిరాజ్,సొసైటీ అధ్యక్షులు రామస్వామి, ముదిరాజ్ తాలూకా నాయకులు బండారి శ్రీనివాసులు,జిల్లాల అధ్యక్షులు తాడెం జంగయ్య, బిసి సెల్ అధ్యక్షులు పురుగుల నరసింహ,గుడి శ్రీనివాసులు, నిరంజన్ ముదిరాజ్,ఎస్సీ సెల్ అధ్యక్షులు శేఖర్,అంజి యాదవ్, రమేష్,అరవింద్ గౌడ్,జమ్ముల శంకర్,జనార్ధన్, దస్తగిరి, రాములు,జంగయ్య,మరియు తదితరులు పాల్గొన్నారు.

## 31లోగా చేయూత పెన్షన్ల పూర్తి డేటా సేకరణ: మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున స్వామి



**జమ్మికుంట, ఆగస్టు 12 (నినాదం) :** జమ్మికుంట మున్సిపాలిటీ పరిధిలో చేయూత పెన్షన్లకు సంబంధించి అర్హులైన ప్రతి ఒక్కరి పూర్తి వివరాలను ఆగస్టు 31, 2026లోగా సేకరించాలని మున్సిపల్ కమిషనర్ జి. మల్లికార్జున స్వామి ఆదేశించారు. జమ్మికుంట మున్సిపల్ కార్యాలయంలో బుధవారం వార్డు ఆఫీసర్లు, కార్యాలయ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో కమిషనర్ జి. మల్లికార్జున స్వామి, మున్సిపల్ చైర్‌పర్సన్ ములుగు ప్రశాంత్ కుమార్ దిలీప్ మాట్లాడుతూ, ప్రతి వార్డులో కౌన్సిలర్ల సహకారంతో వార్డు ఆఫీసర్లు ఇంటింటికీ వెళ్లి చేయూత పెన్షన్లపై వివరాలు సేకరించాలని సూచించారు. ప్రతి వార్డులో పెన్షన్ అర్హత ఉన్నప్పటికీ ఇప్పటివరకు పెన్షన్ పొందని వారిని గుర్తించి, అర్హులైన ప్రతి ఒక్కరి నుంచి దరఖాస్తులు స్వీకరించి, ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలని తెలిపారు. చేయూత పెన్షన్లలో వితంతు, ఒంటరి మహిళ, వికలాంగులు, చేనేత కార్మికులు, గీత కార్మికులు తదితర అర్హులైన వారు ఎవరైనా పెన్షన్ పొందకుండా ఉన్నట్లయితే వారిని గుర్తించి, మున్సిపల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక పెన్షన్ దరఖాస్తు కేంద్రం ఏర్పాటు చేయడమైనది. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకం అందేలా ఇంటింటికీ వెళ్లి పూర్తి స్థాయిలో వివరాలు సేకరించి, ఎలాంటి అర్హుడు కూడా పథకానికి దూరం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో మున్సిపల్ మేనేజర్ జి. రాజిరెడ్డి, ఏఈ వికాస్, జేఏఓ రాజశేఖర్ రెడ్డి, ఇన్స్పెక్టర్ ఐ. రమేష్, టీపీబీవో దీపిక, సీనియర్ అసిస్టెంట్ భాస్కర్, శ్రీనివాస్, వార్డు ఆఫీసర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## అభివృద్ధి పనుల్లో వేగం పెంచి నిర్ణీత గడువులో పూర్తి చేయాలి

### రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**జగిత్యాల ప్రతినిధి ఆగస్టు 12 నినాదం :** ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో చేపడుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తో కలిసి సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో నియోజకవర్గ అభివృద్ధి పనుల పురోగతిపై మంత్రి సమీక్ష నిర్వహించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ,క్షేత్రస్థాయిలో అభివృద్ధి పనుల పురోగతి ఏమాత్రం సంతృప్తికరంగా లేదని, ప్రతి పనికి స్పష్టమైన షెడ్యూల్ రూపొందించుకుని నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని ఆదేశించారు. సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు కాంట్రాక్టర్లతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ పనులను వేగవంతం చేయాలని, క్షేత్రస్థాయిలో ఎదురయ్యే సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పనులను అనవసరంగా జాప్యం చేయవద్దని, కాంట్రాక్టర్లు సహకరించకపోతే వెంటనే చర్యలు తీసుకుని అవసరమైతే బ్లాక్‌లిస్ట్ చేయాలని స్పష్టం చేశారు. మంజూరైన అన్ని పనులకు టెండర్ ప్రక్రియను పూర్తి చేసి క్షేత్రస్థాయిలో పనులు ప్రారంభమయ్యేలా చూడాలని, రానున్న రోజుల్లో అభివృద్ధి పనుల్లో స్పష్టమైన మార్పు ప్రజలకు కనిపించాలని అన్నారు. సబ్ ప్లాన్ నిధులతో చేపట్టే రూ. 5 లక్షల వరకు ఉన్న పనులను ఆలస్యం చేయకుండా స్థానిక ప్రజాప్రతినిధుల సమన్వయంతో వెంటనే ప్రారంభించాలని సూచించారు. ధర్మపురి నియోజకవర్గ అభివృద్ధి పనులను ప్రాధాన్యతా క్రమంలో పూర్తి చేయాలని, వచ్చే ఏడాది గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని ధర్మపురి పట్టణంలో చేపట్టాల్సిన పనులకు ముందుగానే ప్రణాళిక రూపొందించి పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. రోళ్ల వాగు షట్టర్ పనులను ఆగస్టు నెలాఖరులోగా పూర్తి చేయాలని, అక్కేపల్లి లిఫ్ట్ పనులను జనవరి 2027 నాటికి పూర్తి చేయాలని సూచించారు. అవసరమైన నిధులను ఎప్పటికప్పుడు విడుదల చేసేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. పెండింగ్ బిల్లుల వివరాలను తన దృష్టికి తీసుకువస్తే వెంటనే చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకుంటామని, పనులను త్వరగా పూర్తి చేయాలని మంత్రి తెలిపారు. ప్రాజెక్టులకు సంబంధించిన నిర్వహణ పనులను సీజన్ ప్రారంభానికి ముందే ప్రణాళికాబద్ధంగా చేపట్టి పూర్తి చేయాలని సూచించారు. యశ్వంతరావు పేట, రంగధాంపల్లి చెరువుల పనులకు సంబంధించిన అంచనాలను త్వరగా ఆమోదించి పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని, కన్నంపల్లి లింక్ కాలువకు సంబంధించిన పెండింగ్ భూసేకరణ చెల్లింపులను త్వరలో పరిష్కరించి పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ధర్మపురిలో రూ. 3.14 కోట్లతో అభివృద్ధి చేస్తున్న కోరండపల్లి చెరువు పనులు ప్రస్తుతం 35 శాతం పూర్తయ్యాయని, బండ్ ఏర్పాటు, స్టోన్ పిచింగ్ పనులు పూర్తయ్యాయని తెలిపారు. మిగిలిన పునరుద్ధరణ పనులను నిర్ణీత షెడ్యూల్ ప్రకారం పూర్తి చేసి వచ్చే జూన్ 2027 నాటికి చెరువును నీటితో నింపేలా చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ పనులను వెంటనే ప్రారంభించి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని సూచించారు. ధర్మపురిలో తొలి దశలో 2,756 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు కాగా ఇప్పటివరకు 2,462 ఇళ్లకు మార్కింగ్ పూర్తయిందని తెలిపారు. మిగిలిన లబ్ధిదారులను అధికారులు నిరంతరం సంప్రదించాలని, ఇల్లు నిర్మించేందుకు ఆసక్తి చూపని లబ్ధిదారుల స్థానంలో అర్హులైన ఇతర లబ్ధిదారులను ఎంపిక చేయాలని సూచించారు. నిర్మాణానికి అవసరమైన పెట్టుబడి లేని లబ్ధిదారులకు స్వయం సహాయక సంఘాల ద్వారా రుణం అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ధర్మపురిలో 617 ఇళ్ల పూర్తయ్యాయని, 1,295 ఇళ్లు ఫినిషింగ్ దశలో ఉన్నాయని, మిగిలిన ఇళ్ల నిర్మాణాలపై కూడా నిరంతరం పర్యవేక్షణ చేయాలని మంత్రి ఆదేశించారు. రెండో దశలో ధర్మపురి ని గుడిసెలు లేని నియోజకవర్గంగా తీర్చిదిద్దాలని, ప్రతి గుడిసెకు ఇల్లు అందేలా చర్యలు తీసుకోవాలని, అర్హులైన పేదలకు పారదర్శకంగా ఇళ్లు మంజూరు చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ,ధర్మపురి నియోజకవర్గంలో ఆర్‌డబీ శాఖ ఆధ్వర్యంలో రూ. 463 కోట్ల విలువైన 26 పనులు మంజూరయ్యాయని తెలిపారు. వీటిలో రూ. 19 కోట్ల బిల్లులు చెల్లించగా, రూ. 11 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. 10 పనులు పూర్తయ్యాయని, 12 పనులు పురోగతిలో ఉండగా, 2 పనులు ఇంకా ప్రారంభం కాలేదని తెలిపారు. పురోగతిలో ఉన్న పనులను త్వరగా పూర్తి చేసేలా ఇంజనీర్లు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యటించాలని, అవసరమైన చోట కార్మికుల సంఖ్యను పెంచాలని ఆదేశించారు. పంచాయతీరాజ్ శాఖ పరిధిలో గత సంవత్సరం చేపట్టిన, ప్రస్తుతం కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను త్వరగా పూర్తి చేయాలని తెలిపారు.



గ్రామీణ ప్రాంతాల్లో రూ. 153 కోట్ల విలువైన 396 పనులు మంజూరు కాగా, రూ. 31 కోట్ల విలువైన 96 పనులు పూర్తయ్యాయని వివరించారు. ఈ.జీ.ఎస్, కింద రూ. 18 కోట్ల విలువైన 296 పనులు మంజూరు కాగా ఇప్పటివరకు రూ. 4.6 కోట్ల మేర ఖర్చు జరిగిందని, గ్రౌండింగ్ అయిన అన్ని పనులను నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ధర్మపురి పట్టణంలో టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ. 12.85 కోట్లతో 8 అభివృద్ధి పనులు చేపట్టగా 5 పనులు పూర్తయ్యాయని, మరో పని ఫినిషింగ్ దశలో ఉందని తెలిపారు. షాపింగ్ కాంప్లెక్స్ టెండర్ దశలో ఉండగా, ప్రవేశ ద్వారాల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని వివరించారు. ధర్మపురి పట్టణ తాగునీటి సరఫరా కోసం అమృత్ 2.0 కింద రూ. 23 కోట్లతో చేపట్టిన పనుల్లో 22.2 కిలోమీటర్ల పైప్‌లైన్ లో 82 శాతం, 900 గృహ కనెక్షన్ల లో 77 శాతం పనులు పూర్తయ్యాయని తెలిపారు. ఈ పనులను డిసెంబర్ 2026 నాటికి పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. టీజీఈడబ్ల్యూఐడీసీ ఆధ్వర్యంలో మొత్తం 29 పనులకు రూ. 234 కోట్ల విలువైన పనులు మంజూరు కాగా, ఇందులో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్‌కు రూ. 200 కోట్లు కేటాయించామని కలెక్టర్ తెలిపారు. పీఎం శ్రీ పాఠశాలలు, మరమ్మతులు, భావిత కేంద్రాలకు సంబంధించిన 16 పనులు పూర్తయ్యాయని వివరించారు. ఈ సమీక్షలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు బి రాజ గౌడ్, సంబంధిత ఇంజనీరింగ్ శాఖల అధికారులు, ఎంపిడిఓ లు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు